**భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమం**





జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



# ఆదిలాబాద్
## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

బుధవారం 17 జూన్ 2026 | పేజీలు : 16


# చినుకు చింత



తొలి వానల కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్న అన్నదాతలు దుక్కులు దున్ని, విత్తనాలు సిద్ధం చేసినా ముందుకు సాగని సాగు

నిర్మల్ జిల్లాలో వర్షాధార వ్యవసాయంపై తీవ్ర ప్రభావం మామడ మండలం ప్రజాజ్యోతి ప్రతినిధి ఎలిగేటి వంశీ కృష్ణ నేత

ఆలస్యమవుతున్న నైరుతి రుతుపవ నాలతో రైతుల్లో పెరుగుతున్న ఆందోళన

"రైతు కళ్లలో ఆశ... ఆకాశంలో మేఘాల కోసం ఎదురుచూపు" అన్న పరిస్థితి ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కనిపిస్తోంది. వానాకాలం ప్రారంభమైనా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సాగుకు సిద్ధమైన పొలాలు వర్షపు చినుకుల కోసం ఎదురు చూస్తుండగా, రైతుల ఆశలు మాత్రం ఆకాశానికే పరిమితమవుతున్నాయి.నైరుతి రుతుపవనాల ప్రభావం మందగించడంతో జిల్లాలో వ్యవ సాయ కార్యకలాపాలు ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదు.

9



## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ కల సాకారం
# దిశగా అడుగులు

భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తాం జిల్లా కలెక్టర్ రాజర్షి షా

డిఫెన్స్‌కు 1,500 ఎకరాలు రన్ వే విస్తరణకు మరో 80 ఎక రాలు

ఎంపీ, ఎమ్మెల్యే, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష

## నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం.

**జన్నారం,జూన్16(ప్రజాజ్యోతి)**జన్నారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడి ప్రభాకర్ రావు ప్రకటన లో పేర్కొన్నారు. 33 కెవి, 11 కె.వి లైన్ లకు ఇరు పక్కన ఉన్న చెట్ల కొమ్మలను కొట్టివేస్తున్నందున ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## కోర్టు విచారణకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు



**రామకృష్ణాపూర్,జూన్ 16 (ప్రజా జ్యోతి):**?క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల ఘర్షణల కేసులో పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కోర్టు విచారణకు హాజరయ్యారు.? బీఆర్ఎస్ సీపీఐ కూటమికి 14 స్థానాల స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ, అధికార బలంతో మున్సిపాలిటీని చేజిక్కించుకోవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ నేతలు తమపై కక్షపూరితంగా తప్పుడు కేసులు పెట్టించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ అడ్డంకులను అధిగమించి హైకోర్టు ఆదేశాలతో జరిగిన ఎన్నికల్లో తామే విజయం సాధించి మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగుర వేశామని గుర్తుచేశారు. ఈ కేసులను న్యాయపరంగానే ఎదుర్కొంటామని, చట్టంపై తమకు పూర్తి నమ్మకం ఉందని వారు స్పష్టం చేశారు.

## వర్షాకాలం ముందస్తు చర్యలు: పోచమ్మ కాలనీలో డ్రైనేజీ పనులు

**కౌన్సిలర్ జాడి వినోద్ కుమార్ పర్యవేక్షణ**



**ఆసిఫాబాద్ జూన్ 16 ప్రజా జ్యోతి** వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఆసిఫాబాద్ పట్టణం జనకాపూర్ 1వ వార్డు పోచమ్మ కాలనీలో డ్రైనేజీ కాలువల సమస్యను కౌన్సిలర్ జాడి వినోద్ కుమార్ మంగళవారం పరిశీలించారు.స్థానికంగా పూడిక, చెత్తతో నిండిపోయిన డ్రైనేజీ కాలువలను ప్రొక్లెయిన్ యంత్రం సహాయంతో తొలగించారు. వర్షాకాలంలో మురుగు నీరు నిలవకుండా, కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందుజాగ్రత్తగా ఈ పనులు చేపట్టినట్లు కౌన్సిలర్ తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, తక్షణమే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

# మంచిర్యాల నూతన డీఎంహెచ్‌వోకు తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఘన సన్మానం

### వ్యాధిగ్రస్తులకు అండగా ఉంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్ హామీ

**మంచిర్యాల , 16, జూన్(ప్రజాజ్యోతి ):** మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డీఎంహెచ్‌వో) నూతన అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్‌ను తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించిన అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్‌ను కూడా సొసైటీ సభ్యులు ప్రత్యేకంగా సన్మానించారు. ముఖ్యంగా అత్యంత ఖరీదైన 'హైడ్రాక్సీ యూరియా', 'పెంటెడ్ సోడా మెంట్' మందులను ప్రత్యేకంగా తెప్పించి బాధితులకు ఉచితంగా అందించడంలో ఆయన చేసిన సేవలను కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని తలసేమియా, సికిల్ సెల్ బాధితుల ఆరోగ్య పరిస్థితిని డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అలాగే వారికి అవసరమైన 'పెంటెడ్ సోడా మెంట్' టాబ్లెట్లు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని




విజ్ఞప్తి చేశారు. సొసైటీ విన్నపాలపై స్పందించిన డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలోని తలసేమియా బాధితులకు జిల్లా వైద్య శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధితులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బొజ్జ వెంకటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బండ అవినాష్, జాయింట్ సెక్రెటరీ రత్నం తిరుపతి, ప్రతినిధులు దుర్గం ప్రవీణ్ కుమార్, దుర్గం ప్రవీణ్, గాండ్ల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాంపూర్ సీహెచ్‌పీ ఇన్‌చార్జి డీజీఎం ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తున్న గుర్తింపు సంఘం ఏఐటీయూసీ

## నిరసనగా జూన్ 18న భారీ ధర్నాకు పిలుపు

**మంచిర్యాల , 16, జూన్(ప్రజాజ్యోతి ):** సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ సీహెచ్‌పీను నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా



మాట్లాడుతూ సీహెచ్‌పీ ఇన్‌చార్జి డీజీఎం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. గుర్తింపు కార్మిక సంఘంతో ఎలాంటి చర్చలు, సంప్రదింపులు జరపకుండా ఇతర కార్మిక సంఘాలకు ప్రాధాన్యత ఇస్తూ గుర్తింపు సంఘాన్ని కార్మికుల్లో విఫలం చేయడానికి ప్రయత్నిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ నిర్ణయాలను నిరసిస్తూ జూన్ 18, గురువారం రోజున గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సీహెచ్‌పీలోని క్వాలిటీ విభాగంలో ఇప్పటికే సీనియర్ కెమిస్ట్రీ సూపర్వైజర్ ఉన్నప్పటికీ అవసరం లేకుండా మరో జూనియర్ కెమిస్ట్‌ను జనరల్ షిఫ్ట్‌లో నియమించారని, ఒకే కెమిస్టును సెకండ్ షిఫ్ట్, నైట్ షిఫ్ట్‌లలో నిరంతరం పని చేయించడం వల్ల అతని ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని వివరించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆరోపించారు. అదేవిధంగా సీహెచ్‌పీలోని పిట్ స్టోర్స్‌లో ఉన్న పలు మెటీరియల్స్‌ను సరైన లెక్కలు లేకుండా ఇతర ప్రాంతాలకు తరలించారని, దీనిపై ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. క్లరికల్ సిబ్బందికి కనీస సెలవులు మంజూరు చేయడంలో కూడా ఇబ్బందులు సృష్టిస్తున్నారని, సేఫ్టీ కమిటీ సమావేశాల్లో సభ్యులు భద్రతకు సంబంధించిన అంశాలను ప్రస్తావించినా వాటిని పట్టించుకోవడం లేదని అన్నారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఇలాంటి నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శులు జిల్లాల రవి, గునిగంటి నర్సింగ్రావు, సహాయ కార్యదర్శి సాయిరాజు, నాయకులు అశోక్ రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు నాడే పరలోకాలకు..... చింతగూడ వాసి హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో మృతి.



**జన్నారం,జూన్16(ప్రజా జ్యోతి)** పుట్టినరోజు సందర్భంగా స్నేహితులతో సరదాగా జరుపుకుందాం అనే ఆలోచనతో ఉన్న యువకుడు దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పుట్టినరోజు నాడే పరలోకాలకు పోయిన కొడుకుని చూసి తల్లిదండ్రులు మరియు బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన గుండా మల్లేష్ సుజాత దంపతుల పెద్ద కుమారుడు గుండా రాకేష్(22) హైదరాబాదులో హోటల్ మేనేజ్మెంట్ చేస్తున్నాడు మంగళవారం రాకేష్ పుట్టినరోజు కావడంతో ఆయన స్నేహితులు సోమవారం రాత్రి 12 తర్వాత కేక్ కట్ చేస్తామని చెప్పడంతో బైక్ మీద రాకేష్ స్నేహితుల దగ్గరికి వెళుతుండగా ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఉన్న డివైడర్ ను ఢీకొడంతో తలకు బలమైన గాయం తగిలి మృతి చెందాడు. గుండా మల్లేష్ కు ఇద్దరు కుమారులు ,ఒక కుమార్తె.మృతుడు రాకేష్ పెద్దవాడు. ఒక్కసారిగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మేకల మండిలో అక్రమ వసూళ్లు




**మంచిర్యాలరూరల్ జూన్16(ప్రజాజ్యోతి)** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి మేకల మండిలోని వ్యాపారులపై అదనపు రుసుముల భారం మోపుతున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహించిన వేలంలో వేలం పాట దక్కించుకున్న కాంట్రాక్టర్, కార్పొరేషన్ నిర్ణయించిన రుసుములకు మించి వ్యాపారుల నుంచి అదనపు వసూళ్లు చేస్తున్నట్లు పలువురు వ్యాపారులు ఆరోపిస్తున్నారు.ఒక్కో మేకకు వ్యాపారి నుండి రూ.50, కొనుగోలుదారు నుండి మరో రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని,దీనివల్ల చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.అధికారిక రుసుము వాస్తవంగా ఎంత వసూలు చేస్తున్నారు?అనే అంశాలపై స్పష్టత లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మేకల మండి రుసుముల వివరాలను బహిరంగంగా ప్రదర్శించక పోవడం,వసూళ్లపై పర్యవేక్షణ లోపించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లోని మేకల మండిలలో కొనుగోలుదారు వద్ద నుండి రూ.20 రూపాయలు వసూలు చేస్తారని తెలిసింది. మహానగరంలో లేని రుసుము మంచిర్యాల కార్పొరేషన్లో ఎందుకని వసూలు చేస్తున్నారని ప్రజలు కాంట్రాక్టర్ని ప్రశ్నిస్తున్నారు.ఈఅక్రమ వసూళ్ల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి విచారణ జరపాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు. "వేలంలో హక్కులు దక్కాయా?రైతుల జేబులు ఖాళీ చేసే లైసెన్స్ దక్కిందా?"అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేసి మండిలో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఈ నెల 20 న మెగా జాతీయ లోక్ అదాలత్.

**కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి.ఎస్.ఐ ఉదయ్ కిరణ్**



**జన్నారం,జూన్16 (ప్రజాజ్యోతి)** ఈనెల 20న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ సూచించారు. రాజీమార్గమే రాజమార్గమని,కక్షలు, కార్పణ్యాలతో ఏమీ సాధించలేమని,రాజీపడితే ఇద్దరూ గెలిచినట్లేనని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాల కక్షిదారులు అంగీకారం తో సత్వర పరిష్కారం పొందవచ్చు అని అన్నారు.లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు. రాజీపడదగిన కేసులలో సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ మరియు నిర్వహణ కేసులు, వైవాహిక వివాదాలు బ్యాంక్ రికవరీ కేసులు, విద్యుత్ బిల్లుల కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్న చిన్న కేసులు,ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీ మార్గం రాజ మార్గ మని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని,డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు.జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎస్.ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై అవగాహన సదస్సు నిర్వహణ

**బిఎల్ఓలు 100 శాతం ఇంటింటి సర్వే పూర్తి చేయాలి**

**నాయబ్ తహసిల్దార్ గడియారం శ్రీహరి**



**మంచిర్యాల 16, జూన్(ప్రజాజ్యోతి):** మంచిర్యాల మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసిల్దార్ రఫత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గానికి చెందిన నాయబ్ తహసిల్దార్ గడియారం శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని బిఎల్ఓలు, బిఎల్ఏలు, సూపర్వైజర్లకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణ విధానం గురించి అవగాహన కల్పించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ప్రతి బిఎల్ఓ ఇంటింటికి వెళ్లి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని, అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల సీనియర్ సహాయకుడు సంజీవ్, మండల గిర్దావర్లు శిరీషతో పాటు మండల పరిధిలోని బిఎల్ఓలు, బిఎల్ఏలు, జీపీఓలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ నరేందర్ రాథోడ్ బాధ్యతల స్వీకరణ





**మంచిర్యాల, 16, జూన్ ( ప్రజా జ్యోతి ):** మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ నరేందర్ రాథోడ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఐఏఎస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమా లను సూచికల ఆధారంగా సమీక్షించి, జిల్లాను ఆరోగ్య సేవల అమలులో ముందంజ లో ఉంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల కారణంగా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.అదేవిధంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామపంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, చైర్మన్ల సహకారంతో ప్రజలకు వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందించాలని కోరారు.అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచిస్తూ, మాతా–శిశు సంరక్షణ, టీకాల కార్యక్రమం, క్షయ వ్యాధి నియంత్రణ, అసంక్రమణ వ్యాధుల నివారణ, జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి తెలియజేయాలని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ అనిల్, విశ్వేశ్వర్ రెడ్డి, డీపీఓ ప్రశాంతి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, జిల్లా హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మహ్మద్ రషీద్, అల్లాడి శ్రీనివాస్, నాందేవ్, కాకినాడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బాలలు బడిబాట పట్టేలా...





**మామడ జూన్ 17 ( ప్రజా జ్యోతి)** మామడ మండలంలోనీ పొన్కల్ గ్రామంలో గల అంగన్వాడి టీచర్లు బడి బయట ఒక్క చిన్నారి కూడా ఉండకూడదన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. మహిళలు, చిన్నారుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమానికి పోన్కల్ లో విశేష స్పందన లభిస్తోంది అని అంటున్నారు.అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను ఆహ్వానించడంతో నమోదు ప్రక్రియ వేగవంతం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారం, ప్రీస్కూల్ విద్య, ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన వారిని లబ్ధిదారులుగా నమోదు చేస్తున్నారు. కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సేవలను ప్రత్యక్షంగా చూపిస్తూ తల్లుల్లో అవగాహన పెంచుతున్నారు.బడి బాట కార్యక్రమంలో గ్రామ అంగన్వాడీ టీచర్లు రాధా,రామ సలోమి ఇందిరా, రేణుఖతో పాటు గ్రామ ఎం పీ పీ ఎస్ స్కూల్ ఉపాధ్యాయులు ప్రిన్సిపల్ శారద,మౌనిక సరిత, శ్రావ్య తో పాటు విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు

## నిర్మల్ సర్కిల్ లో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పర్యటన

వర్షాల వలన దెబ్బతిన్న లైన్లను క్షేత్ర స్థాయిలో పరిశీలన 33/11 కేవీ కడెం విద్యుత్ ఉపకేంద్రాన్ని సందర్శించిన సీఎండీ

అటవీ ప్రాంతాల గుండా వెళ్తున్న కడెం, పెంబి ప్రాంతాలలో 33 కేవీ , 11 కెవి కవర్డ్ కండక్టర్లను ఏర్పాటు

భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి





**ఖానాపూర్ జూన్ 16( ప్రజా జ్యోతి)**నిర్మల్ సర్కిల్ లో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మంగళవారం ఖానాపూర్, కడెం,పెంబి, దస్తురాబాద్ మండల విద్యుత్ ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా కడెం సెక్షన్ పరిధిలోని లింగాపూర్ గ్రామం ఖానాపూర్ సెక్షన్ పరిధిలోని మాస్కాపూర్ గ్రామాలలో వర్షాల వలన దెబ్బతిన్న లైన్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ముఖ్యంగా వర్షాకాలం, ఈదురుగాలులు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల సమయంలో చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లపై పడటం వల్ల ఏర్పడే అంతరాయాలను నివారించేందుకు ముందస్తు అన్ని సత్వర చర్యలు తీసుకోవాలని సీఎండీ వరుణ్ రెడ్డి సూచించారు. అనంత రం 33/11 కేవీ కడెం విద్యుత్ ఉపకేంద్రాన్ని పరిశీలించారు. ఉపకేంద్రం పనితీరు, నిర్వహణ కార్యకలాపాలు, వినియోగదారులకు అందిస్తున్న విద్యుత్ సేవల నాణ్యతపై సీఎండీ తెలుసుకున్నారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలన్నారు విద్యుత్ అంతరాయాలను సాధ్యమైనంత వరకు తగ్గించేలా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు సూచించారు.కడెం, పెంబి అటవీ ప్రాంతాల గుండా వెళ్తున్న 33 కేవీ విద్యుత్ లైన్లపై కవర్డ్ కండక్టర్లను ఏర్పాటు చేయాలని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. సుదూర ప్రాంతాలలో వర్షకా లంలో అడవి ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి లైన్ ల మీద పడి విద్యుత్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుంది కనుక అంతరా యాలను నివారించడానికి కవర్డ్ కండక్టర్ల ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. తద్వారా విద్యుత్ అంతరాయాలను నివారించవచ్చని పేర్కొన్నారు. కడెం, పెంబి, దస్తురాబాద్ లో అన్ని 33 కెవి సబ్ స్టేషన్లకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఉండేటట్లు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భారీ వర్షాలు ఈదురుగాలుల సమయంలో విద్యుత్ లైన్లు తెగిపోవడం వలన విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. ఇలా అంతరాయాలు ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ద్వారా అందించే సౌకర్యం వలన వినియోగదారుల కు విద్యుత్ అంతరాయం ఉండవని పేర్కొన్నారు. 132 కెవి కొత్త సబ్ స్టేషన్ తాళ్లపేట కు మంజూరు అయ్యిందని నిర్మల్ 220 కెవి సబ్ స్టేషన్ నుంచి 132 కెవి ఖానాపూర్ కు వచ్చే లైన్ డబల్ సర్క్యూట్ చేస్తామని చెప్పారు. తద్వారా మూడు ప్రాంతాల గుండా విద్యుత్ సరఫరా ఏర్పాటుకు అవకాశం ఉంటుందని వివరించారు. అదేవిధంగా, విద్యుత్ లైన్లపై విధులు నిర్వహించే సమయంలో పాటించాల్సిన భద్రతా నిబంధనలపై ఓ ఎం సిబ్బందితో సీఎండీ ప్రత్యేకంగా చర్చించారు. నిర్వహణ, మరమ్మత్తు పనుల సమయంలో నిర్దేశిత భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అనుసరించాలని స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణకు సిబ్బంది వ్యక్తిగత రక్షణ పరికరాలు భద్రతా ఉపకరణాలను విధిగా వినియోగించాలని ఆదేశించారు. ఉద్యోగుల భద్రత సంస్థకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్న సీఎండీ "భద్రతే మొదటి కర్తవ్యం" అనే స్ఫూర్తితో ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయలన్నారు ఈ కార్యక్రమంలో నిర్మల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ రాథోడ్ సుభాష్, డి.ఈ (ఆపరేషన్) నిర్మల్ డి. నాగరాజు, డి.ఈ (ఎంఆర్టీ కన్స్ట్రక్షన్) సాంకేతిక విభాగానికి చెందిన డి.ఈ శ్రీ భాస్కర్, తిలక్, ఏ.డి.ఈ (ఆపరేషన్) ఖానాపూర్ శ్రీనివాస్, అలాగే సంబంధిత సబ్ డివిజన్ పరిధిలోని ఏఈలు విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన చైర్‌పర్సన్



**రామకృష్ణాపూర్,జూన్ 16 (ప్రజా జ్యోతి):**క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని మున్సిపల్ చైర్‌పర్సన్ గోడిసెల సంధ్యారాణి సందర్శించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.? ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య లోపం, తాగునీటి ఎద్దడి, బోర్‌వెల్ మరమ్మతులు, పిచ్చిమొక్కల తొలగింపు,భద్రత కోసం ఫెన్సింగ్, ప్రవేశ ద్వారం ఏర్పాటు వంటి పలు మౌలిక వసతుల కల్పనపై మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, అధికారులతో చర్చించారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా, మెరుగైన వైద్య సేవలందించేందుకు అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించా లని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తదానంతో ఎమ్మెల్యే పై అభిమానాన్ని చాటుకున్న ఉద్యమకారుడు



**నేరడిగొండ జూన్ 16 (ప్రజాజ్యోతి):** బోథ్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ అనిల్ జాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ రిమ్స్ ఆడిటోరియంలో ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నేరడిగొండ మండలం కుమారి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ యువజన విభాగం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కుంట కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేయడం ద్వారా ఎమ్మెల్యేపై తనకున్న అభిమానాన్ని ఆయన చాటుకున్నారు.అనంతరం కుంట కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఎల్లప్పుడూ నియోజకవర్గ ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజల కోసమే తన సర్వస్వాన్ని త్యాగం చేస్తున్నారని కొనియాడారు. అతి తక్కువ కాలంలోనే ఆయన ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసి, మన్ననలు పొందారని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో అనిల్ జాదవ్ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు సాధించాలని, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ రక్తదాన కార్యక్రమంలో తాంసి, తలమడుగు, బీంపూర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## ప్రైవేట్ స్కూల్ల లో ఫీజులను నియంత్రించాలి



**కుంటాల జూన్ 16(ప్రజాజ్యోతి)**మండల వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో పీజులు నియంత్రించాలని కోరుతూ ఆర్టీఐ సామజిక కార్యకర్త సయ్యద్ కలిం,ఎంఈఓ ముత్యం కు,వినతి పత్రం అందించరు,కుంటాల మండలంలోని ప్రైవేటు పాఠశాలలో తరగతుల వరీగా ఫీజుల యొక్క వివరాలను ప్రదర్శించాలని పాఠ్య పుస్తకాలు ఇతర సామాగ్రి అధిక ధరలకు అమ్మకుండా నియంత్రించాలని విద్య హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కుంటాల మండల విద్యాశాఖ అధికారి ముత్యం కు సామాజిక కార్యకర్త న్యాయ విద్యార్థి సయ్యద్ కలీం అన్నారు

## జన్మదిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకున్న

నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులువెడ్మ బొజ్జు పటేల్



**ఖానాపూర్ జూన్ 16 (ప్రజా జ్యోతి )**నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ జన్మదిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ప్రజల్లో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు పొందిన ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎమ్మెల్యే కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలతో మమేకమై ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు తీర్చాలని ఆకాంక్షించారు ఇలాంటి పుట్టినరోజు కార్యక్రమాలు మరెన్నో జరుపుకోవాలని కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో మెలగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు

## బోథ్ మండల ఉపసర్పంచుల ఫోరం నూతన కమిటీ ఎన్నిక



**బోథ్, జూన్ 16 (ప్రజా జ్యోతి)** బోథ్ మండలంలోని ఉపసర్పంచుల సమన్వయం, గ్రామాల అభివృద్ధి మరియు స్థానిక సమస్యల పరిష్కార లక్ష్యాలతో బోథ్ మండల ఉపసర్పంచుల ఫోరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడిగా సుద్దుల అరుణ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఇట్టేడి రమణారెడ్డి, బండారి స్వామి, ప్రధాన కార్యదర్శిగా మామిడి సంతోష్, కోశాధికారిగా పుండ్రు విజయరాజా రెడ్డి ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా గోడం భీమరావు, సుందర్ సింగ్, దొమ్మటి రాజేందర్ బాధ్యతలు స్వీకరించగా, గౌరవ అధ్యక్షుడిగా తలంపుల రమేష్ ఎన్నికయ్యారు.ఈ సమావేశంలో బోథ్ మండలంలోని 21 గ్రామ పంచాయతీల ఉపసర్పంచులు పాల్గొని నూతన కమిటీకి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు కోసం ఉపసర్పంచులందరూ ఐక్యంగా పనిచేయాలని నిర్ణయించారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు తమపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, బోథ్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఉపసర్పంచుల హక్కుల పరిరక్షణతో పాటు గ్రామీణాభివృద్ధి కోసం ఫోరం వేదికగా పనిచేస్తుందని వారు తెలిపారు.

## భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమం

### జిల్లాలో వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, 16, జూన్ (ప్రజాజ్యోతి):** భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమమని ,జిల్లాలో చేపట్టనున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్యతో కలిసి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో వనమహోత్సవ నిర్వహణపై మంగళవారం సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పరస్పర సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా వనమహోత్సవ కార్యక్రమం ప్రారంభం కానుందని, అదే రోజున జిల్లాలో కూడా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. 2026 వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో 41 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కల వివరాలు, ప్లాంటేషన్ సైట్ల నమోదు, ఇతర సమాచారం సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. మొక్కలు నాటిన అనంతరం జియో ట్యాగింగ్ పూర్తి చేసి రోజువారీగా వివరాలను నవీకరించాలని అన్నారు. రహదారులకు ఇరువైపులా పెద్ద చెట్లను నాటాలని, నాటిన ప్రతి మొక్క పెరిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలను నాటాలని తెలిపారు. జిల్లాలో గనుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నందున ఖాళీ ప్రదేశాల్లో విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా ఉష్ణోగ్రతలను నియంత్రించవచ్చని తెలిపారు .అటవీ భూముల వివాదాలు ఉన్న ప్రాంతాల్లో వెదురు మొక్కలను నాటాలని, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో కూడా మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గొడుగుల పంపిణీ

జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రాజురా సత్యం



**ఖానాపూర్ జూన్ 16 (ప్రజా జ్యోతి )**ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్మల్ జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు ఖనాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత గొడుగులను పంపిణీ చేశారు రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ చేతుల మీదుగా అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు గొడుగుల పంపిణీ మంచి కార్యక్రమని అన్నారు అనంతరం కేక్ కట్ చేసి ఎమ్మెల్యే ని శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజీద్ ఆత్మ కమిటీ చైర్మన్ తోటసత్యం కౌన్సిలర్ నిమ్మల రమేష్ మాజీ కౌన్సిలర్ కిషోర్ నాయక్ తుమ్మరన్ జన్నరపు శంకర్ అమానుల్లా ఖాన్ శ్రీపాద శేషాద్రి పాఠశాలల విద్యార్థులు కేఎన్ఆర్ కళాశాల ఉపాధ్యాయులు సిబ్బందితదితరులు పాల్గొన్నారు

## పోగొట్టుకున్న ఫోన్ గుర్తించి అప్పగించిన పోలీసులు



**రామకృష్ణాపూర్,జూన్ 16 (ప్రజా జ్యోతి):**పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను రామకృష్ణాపూర్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించి బాధితురాలికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఫోన్‌ను గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన పోర్టల్ వర్టికల్ ఇన్‌చార్జ్ అకిల్‌రెడ్డిని ఎస్ఐ జే.శ్రీధర్ అభినందించారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందజేయడం పోలీసు శాఖ అందిస్తున్న ముఖ్యమైన సేవల్లో ఒకటని తెలిపారు.

## మోడీ 12 ఏళ్ల పాలనలో భారత్ శత్రుదుర్భేద్యంగా మారింది

**మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్**



**మంచిర్యాల, 16, జూన్ (ప్రజాజ్యోతి):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో గత 12 సంవత్సరాల పాలనలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే కాకుండా, ప్రపంచ దేశాలు గుర్తించే స్థాయిలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని, ముఖ్యంగా రక్షణ రంగంలో దేశం శత్రుదుర్భేద్యంగా మారిందని మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పదవీ కాలం 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లాలోని చెన్నూరు పట్టణంలో మంగళవారం నిర్వహించిన జనసంపర్క అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు ప్రముఖులను కలిసి కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన సాహిత్యాన్ని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం ద్వారా దేశీయ పరిజ్ఞానానికి ప్రాధాన్యత పెరిగిందన్నారు. స్వదేశీ సాంకేతికతతో అగ్ని క్షిపణులు, యుద్ధ విమానాలు, ఇతర రక్షణ పరికరాల తయారీలో భారత్ విశేష పురోగతి సాధించిందన్నారు. ఒకప్పుడు రక్షణ సామగ్రిని విదేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థితిలో ఉన్న భారత్, ప్రస్తుతం ప్రపంచ దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందని తెలిపారు .అలాగే అంత్యోదయ లక్ష్యంతో చిట్టచివరి బీద ప్రజల వరకు సంక్షేమ ఫలాలు చేరేలా కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమం, దేశ భద్రత, అభివృద్ధి లక్ష్యాలతో మోడీ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, ప్రధాన కార్యదర్శి మాణికరౌతు శంకర్, నాయకుడు అడుపు శ్రీనివాస్, తలారి రాజులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి





**అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య**

**మంచిర్యాల, 16, జూన్ (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని భీమిని మండల కేంద్రంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయన, అక్కడ కొనసాగుతున్న భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పాఠశాలలోని తరగతి గదులు, డైనింగ్ హాలు, స్టోర్ రూమ్‌లను పరిశీలించిన అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భవనానికి వెంటనే పెయింటింగ్ చేపట్టాలని, ఆర్ఓ ప్లాంట్‌కు అవసరమైన మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లకు నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమ శిక్షణలో పాల్గొని పలు సూచనలు చేశారు. భారత ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే పాఠశాలకు మంజూరైన బాలికల మూత్రశాల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి ప్రభుత్వ మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బికార్న దాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. గంగామోహన్, మండల పంచాయతీ అధికారి మహేష్, మండల విద్యాధికారి వెంకటస్వామి, గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యమైన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి





**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, 16, జూన్ (ప్రజాజ్యోతి):** గ్రామస్థాయి నుంచి అభివృద్ధికి బాటలు వేసేలా నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. జిల్లాలోని నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతితో కలిసి గ్రామ అభివృద్ధి ప్రణాళికపై డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధికి నాణ్యమైన ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 16వ ఆర్థిక సంఘం నిబంధనలు, పెసా గ్రామపంచాయతీలు, సభాసర్, నిర్ణయ్ యాప్, ఈ-గ్రామ స్వరాజ్ అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీలకు అత్యుత్తమ ర్యాంకింగ్ వచ్చేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు విధులకు సకాలంలో హాజరై ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామసభలు నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, పన్నులను సకాలంలో వసూలు చేయాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామపంచాయతీకి కార్యాలయ భవనం ఉండేలా చర్యలు చేపట్టాలని, భవనాలు లేని పంచాయతీలకు అనువైన స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అంటువ్యాధులు ప్రబలకుండా, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పారిశుద్ధ్య కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించాలని తెలిపారు . గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీజీజీ కన్సల్టెంట్ మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

**సభ్యత్వ నమోదు ప్రారంభించిన టీయూడబ్ల్యూజే**

**ఐక్యంగా ఉండాలని జిల్లా అధ్యక్షుడు రహమాన్ పిలుపు**



**ఆసిఫాబాద్, జూన్ 16 (ప్రజా జ్యోతి)** జర్నలిస్టుల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసమే తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయు) పనిచేస్తోందని జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో మంగళవారం టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫీల్డ్‌లో జర్నలిస్టులు పడుతున్న ఇబ్బందులపై యూనియన్ నిరంతరం పోరాడుతుందని భరోసా ఇచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సంపత్ కుమార్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా యూనియన్ తరపున చర్యలు తీసుకుంటామన్నారు. జర్నలిస్టుల హక్కుల రక్షణకు టీయూడబ్ల్యూజే ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. జిల్లాలోని జర్నలిస్టులంతా ఐక్యంగా ఉండి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని నాయకులు కోరారు. యూనియన్ బలోపేతం అయితేనే సమస్యలు తీరుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, జిల్లా కోశాధికారి అడప సతీష్, సహాయ కార్యదర్శి దేవునూరి రమేష్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్, కోశాధికారి శ్రీధర్, జర్నలిస్టులు మేకల శ్రీనివాస్, సురేష్ చారి, భాస్కర్ చారి, రాధాకృష్ణ చారి, నితీష్ కుమార్, జానకిరామ్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, తిరుపతి, కిషోర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు వికాసమే సమాజ ప్రగతికి పునాది

**జడ్పీ స్కూళ్లలో పుస్తకాల పంపిణీ**

**హాజరైన కౌన్సిలర్ పుష్పలత, లైబ్రరీ చైర్మన్ అనిల్**



**ఆసిఫాబాద్, జూన్ 16 ప్రజా జ్యోతి** విద్యార్థుల భవిష్యత్తు వికాసమే సమాజ ప్రగతికి పునాది అని 18వ వార్డు కౌన్సిలర్ కస్తూరి పుష్పలత అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాయ్స్, గర్ల్స్ స్కూళ్లలో మంగళవారం పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా కౌన్సిలర్ పుష్పలత, లైబ్రరీ చైర్మన్ అనిల్ కుమార్ హాజరై విద్యార్థులకు పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు పుస్తకాలు అందించడం ద్వారా వారి చదువుకు సహకరించడం సంతోషంగా ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఐఆర్ కోడ్-2020తో కోల్ ఇండియాలో ట్రేడ్ యూనియన్లకు గడ్డు పరిస్థితి

**రిజిస్ట్రేషన్ లేని ఫెడరేషన్లకు గుర్తింపు కోల్పోయే ప్రమాదం**

**కార్మిక వర్గాల్లో ఆందోళన**




**మంచిర్యాల, 16, జూన్ (ప్రజాజ్యోతి):** కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్)లో ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్--2020 (ఐఆర్ కోడ్--2020) అమలుకు జరుగుతున్న సన్నాహాలు బొగ్గు కార్మిక సంఘాల్లో ఆందోళనకు దారితీశాయి. దశాబ్దాలుగా కార్మికుల హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న కేంద్ర ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్లు తమ చట్టబద్ధ గుర్తింపును కొనసాగించుకోవాలంటే తప్పనిసరిగా అధికారిక రిజిస్ట్రేషన్ పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ లేని ఫెడరేషన్లు సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికల్లో పాల్గొనే అర్హతను కోల్పోతాయి. అంతేకాకుండా యాజమాన్యంతో జరిగే అధికారిక చర్చల్లో కార్మికుల ప్రతినిధులుగా గుర్తింపు పొందే అవకాశాన్ని కూడా కోల్పోతాయి. దీంతో కార్మిక సంఘాల భవిష్యత్ ప్రాతినిధ్యం, వేతన ఒప్పందాలు, కార్మిక సంక్షేమ అంశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని కార్మిక నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సీఐఎల్‌లో పనిచేస్తున్న కొన్ని ప్రధాన కేంద్ర ఫెడరేషన్లు ఇంకా అధికారిక రిజిస్ట్రేషన్ పొందలేదని సమాచారం. ఐఆర్ కోడ్ పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చిన తర్వాత చట్టబద్ధంగా నమోదు చేయబడిన సంఘాలకే జాతీయ స్థాయి కమిటీలు, చర్చా వేదికలు మరియు యాజమాన్యంతో జరిగే చర్చల్లో కార్మికుల తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుంది. కార్మిక రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ మార్పు కేవలం పరిపాలనా చర్య మాత్రమే కాదు. కోల్ ఇండియాలోని మొత్తం ట్రేడ్ యూనియన్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించే కీలక పరిణామంగా ఇది మారే అవకాశం ఉంది. భవిష్యత్తులో కార్మికుల గొంతుక ఏ వేదిక ద్వారా వినిపించబడుతుందో, ఏ సంఘాలు అధికారిక గుర్తింపు పొందుతాయో ఈ నూతన నిబంధనల అమలే నిర్ణయించనుంది. బొగ్గు పరిశ్రమలోని కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు త్వరితగతిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి తమ చట్టబద్ధ హక్కులు, ప్రాతినిధ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఏర్పడిందని కార్మిక వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ఐఆర్ కోడ్--2020 అమలు కోల్ ఇండియాలో ట్రేడ్ యూనియన్ వ్యవస్థకు కీలక మలుపుగా మారనున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాల లో పాఠ్యపుస్తకాల పంపిణీ




**సోనాల, జూన్ 16 ( ప్రజాజ్యోతి ):**సోనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందించిన పుస్తకాలను గ్రామ సర్పంచ్ యాల్ల బిందుజ మరియు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గాజుల లక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులు మాట్లాడుతూ… ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయికి ధీటుగా విద్యాబోధన అందుతుందని, విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత వసతులను ఉపయోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు ఓస శ్రీనివాస్, గొల్లపల్లి రమేష్ చందర్, రాడాపు మధుసూదన్, అన్వర్ అలీ, సంతోష్ కుమార్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**హెచ్ఈఓ పవార్ రవీందర్**



**నేరడిగొండ జూన్ 16 (ప్రజాజ్యోతి):**మండల పరిధిలోని గుప్తాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అడాల తిమ్మాపూర్ మరియు లక్ష్మీపూర్ సబ్ సెంటర్ పరిధిలో ఉచిత వైద్య శిబిరం, “స్టాప్ డయేరియా” (విరేచనాల నియంత్రణ) అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ మెస్రం సీతారాం, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ( హెచ్ ఈ ఓ ) పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్లు సంతోష్, స్వర్ణలత హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఈఓ పవార్ రవీందర్ మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు ఆరోగ్య విషయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డయేరియా (విరేచనాలు) బారిన పడకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రతతో పాటు, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని కోరారు. అనంతరం గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఆశా కార్యకర్త ఆత్రం పార్వతి, అంగన్‌వాడీ టీచర్ సెడమ్ శిరీష మరియు గ్రామస్తులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు మోక్షం

**రెడ్ ఫ్లాగ్ ఇళ్లకు ప్రొసీడింగ్స్ మంజూరు**

**విశ్వప్రసాద్ రావు, సక్కు చొరవతో 12 మందికి ఊరట**



**ఆసిఫాబాద్,జూన్ 16 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతలో రెడ్ ఫ్లాగ్ పడి ఆగిపోయిన 12 మంది లబ్ధిదారులకు ఊరట లభించింది. మాజీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో మంగళవారం ఆ 12 మందికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ఇచ్చారు. అర్హులకు అన్యాయం జరగకుండా చూస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అనిల్, కౌన్సిలర్లు రాపర్తి కార్తీక్, అబ్దుల్లా, వినోద్, రాజేందర్, నిఖిల్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ అలీ, నాయకులు జమీర్, ప్రవీణ్, సఫన్ తదితరులు పాల్గొన్నారు

## సిర్పూర్(టి)లోని చిలపల్లి గ్రామానికి చెందిన ఓ యువతీ అదృశ్యం

**యువకుడి పై అనుమానం బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు**

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సిర్పూర్ (టి) ఎస్.ఐ, డి. సాగర్:**

**జూన్ 16, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** యువతి అదృశ్యం: యువకుడిపై అనుమానం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాసిర్పూర్(టి) మండల పరిధిలోని చీలపెల్లి గ్రామానికి చెందిన ఓ యువతి (21) అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. బాధితురాలి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న రాత్రి సుమారు 11:30 గంటల సమయం లో ఆమె కుమార్తె ఇంట్లోంచి బయటకు వెళ్లి, ఎంతసేపటికీ తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాల్లోనూ, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు.

**యువకుడిపై అనుమానం:**

గతంలో ఆసిఫాబాద్ జిల్లా నవేగాం గ్రామానికి చెందిన వెంకటేశ్ అనే యువకుడు తన కుమార్తెను తీసుకెళ్లి, ఆ తర్వాత సిర్పూర్ (టి)లో విడిచిపెట్టాడని తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం కుమార్తె మొబైల్ ఫోన్ స్విచ్చాఫ్ వస్తుండటంతో, సదరు యువకుడిపైనే తమకు బలమైన అనుమానం ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సాగర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## నూతన ఎస్సైకి ఘన సన్మానం

**కెరమెరిలో సర్పంచులు, నాయకుల అభినందన**



**కెరమెరి, జూన్ 16 ప్రజా జ్యోతి** కెరమెరి పోలీస్ స్టేషన్ కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై సుధాకర్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. కెరమెరి సర్పంచ్ ఆనంద్ రావు, మెటపల్లి సర్పంచ్ కొద్దు, కెరమెరి మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు అఫ్సన్ ఖుద్దూస్ ఎస్సై కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరిస్తామని తెలిపారు. నూతన ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండల ప్రజలు చట్టాన్ని గౌరవించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## అంగన్‌వాడీ పాఠశాలల్లో డయేరియాపై అవగాహన



**నేరడిగొండ జూన్ 16 (ప్రజాజ్యోతి):** నేరడిగొండ మండల కేంద్రంలోని కాలనీ అంగన్‌వాడీ కేంద్రం మరి యు ఎంపీపీఎస్ (మండల పరిషత్ ప్రాథమిక) పాఠశా లలో మంగళవారం 'స్టాప్ డయేరియా' పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించా రు. వర్షాకాలం నేపథ్యంలో పిల్లలు, ప్రజలు డయేరియా (విరేచనాలు) బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (హెచ్ఈఓ) పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటించడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం మరియు వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా డయేరియాను అరికట్టవచ్చని పేర్కొన్నారు. చిన్నపిల్లల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. సరిత, ఎస్జీటీ సింధు, ఆశా కార్యకర్త జయమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది మరియు విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సింగ్ గీతం సినిమాలో బాసర చిచ్చరపిడుగు.



**బాసర జూన్ 16 (ప్రజా జ్యోతి)** బాసరకు చెందిన బాలుడు వెండితెరపై ఒక్కసారి మెరిశాడు. ఇటీవల విడుదలైన సింగ్ గీతం సినిమాలో బాలనటుడిగా గురప్ప వినయ్ కుమార్ నటించాడు. ఒకపక్క చదువు మరోపక్క జబర్దస్త్ కామెడీ షో తో పాటు, సినిమాల వైపు ఆకర్షితడయ్యాడు. అతడి చేసిన పలు వీడియోలు నెట్టింట వైరల్ అవ్వడంతో ఈ చిచ్చర పిడుగు వినయ్ ను మండల టీయుడబ్ల్యూజే ఐజెయు మీడియా అధ్యక్షుడు నర్సారి భీమ్ రావు, వీడీసీ అధ్యక్షుడు నూకం లింగరావు, ఆలయ రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగి ఉమ్మాయి భీమ్ రావు, పిప్పర లక్ష్మణ్ రావు తరఫున వారికి శాలువాతో సన్మానించి సినీ పరిశ్రమలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు, అదేవిధంగా రాబోయే రోజుల్లో టాలీవుడ్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో చోటు దక్కించేందుకు నా వంతు కృషి చేస్తానని వినయ్ కుమార్ కు మీడియా తరఫున ప్రత్యేకంగా భరోసా ఇచ్చాను.

## శ్రీరామ్ నగర్ నాలుగో వార్డులో ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా పిల్లలకు

**బ్యాగుల పంపిణీ చేసిన కస్తూరి మహేష్ చాయ్‌వాలా**



**ఖానాపూర్ జూన్ 16 (ప్రజాజ్యోతి)** ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జుపటేల్ పుట్టినరోజు సందర్భంగా ఖానాపూర్ పట్టణంలోని శ్రీరామ్ నగర్ నాలుగో వార్డులో ఆ వార్డు నాయకులు కస్తూరి మహేష్ చాయ్ వాళ చిన్న పిల్లలకు స్కూలుకు వెళ్లే బ్యాగులను ఎమ్మెల్యే ద్వారా పంపిణీ చేశారు పిల్లల సమక్షంలో కేట్ కట్ చేసి పిల్లలతో పాటు తను స్వీట్ తిని తమకు శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థులను ఆశీర్వదించారు భవిష్యత్తులో మంచి చదువులు చదివి ఉన్నత పదవుల్లో ఉండాలని ఆకాంక్షించారు విద్యార్థులకు బ్యాగుల పంపిణీ మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన మహేష్ చాయ్ వాళను ఎమ్మెల్యే అభినందించారు ఈ కార్యక్రమంలో నాలుగో వార్డ్ ప్రజలు మహిళలు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సుర్దాపూర్ రైతుల సమస్యలు పరిష్కరించాలి

**మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతి**



**ఆసిఫాబాద్ జూన్ 16 ప్రజా జ్యోతి** అటవీ శాఖ అధికారుల చర్యల వల్ల సాగు భూముల్లో వ్యవసాయం చేయలేక ఇబ్బందులు పడుతున్నామని సుర్దాపూర్ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆసిఫాబాద్‌లోని కేవీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ తాము ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న భూముల్లో వ్యవసాయ పనులు చేపట్టకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని, దీంతో జీవనోపాధి దెబ్బతింటోందని పేర్కొన్నారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు రైతుల సమస్యను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతుల హక్కులను కాపాడేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కాంబ్లే, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, సుర్దాపూర్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ కీర్తిని చాటిన చరణ్

**ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

**క్రీడాకారులకు అండగా ఉంటామని హామీ**



**ఆసిఫాబాద్, జూన్ 16 (ప్రజా జ్యోతి** సౌత్ ఆసియా సాఫ్ట్ బేస్‌బాల్ కప్-2026లో సత్తా చాటిన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా క్రీడాకారుడు ముప్పిడి చరణ్‌ను ఎమ్మెల్యే కోవ లక్ష్మి అభినందించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చరణ్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మారుమూల జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. చరణ్ సాధించిన విజయం జిల్లా యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లాలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చరణ్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మి ఆలయంలో ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా పవిత్ర

**గంగోత్రి జలాలతో అభిషేకం**





**ఖానాపూర్ జూన్ 16 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు ఆదివాసీ పోరు బిడ్డ వేడమ బొజ్జు పటేల్ జన్మదినోత్సవం సందర్భంగా పట్టణంలోని రెండవ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకులు శివాజీ నగర్ ప్రాంతంలో గల శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో అర్చకులు పిస్పాటి రేవంత్ శర్మ చే పవిత్ర గంగోత్రి గంగ జలాలతో అభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్థానిక అంగన్వాడి స్కూల్లో పిల్లలకు పలకలు పంపిణీ చేసి కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన సంబరాలు ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో రెండవ వార్డ్ నాయకులు ధ్యావతి రాజేశ్వర్ బక్కశెట్టి లక్ష్మణ్, కిషోర్ దాసరి రాజన్న గుగ్గిళ్ళ రాజేందర్ గౌడ్ సిలివేరి, రాము రాజేశ్వర్ మాజీ మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ రాజుర సత్యం కావలి సంతోష్ లతో పాటు అంగన్వాడీ టీచర్ కారింగుల విజయ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# హట్టహాసంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వేడమ బొజ్జు పటేల్ జన్మదిన వేడుకలు

**అన్నదానాలు, రక్త దానాలు**

**అడుగడుగునా నీరాజనాలు**





**ఖానాపూర్ జూన్ 16( ప్రజా జ్యోతి)** నిర్మల్ జిల్లా ఖానాపూర్ శాసనసభ్యులు ఆదివాసి పోరు బిడ్డ ఎడమ బొజ్జు పటేల్ జన్మ దిన వేడుకలు అన్నదానాలు రక్త దానాలు వివిధ సామాజిక కార్యక్రమాలతో ఖానాపూర్ కడెం దసరా బాద్ మండలాల్లో అట్టహాసంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జరిపించారు ఎమ్మెల్యే మధ్యాహ్నం హైదరాబాద్ సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులు తీసుకొని ఖానాపూర్ మండలంలోని బాదనకుర్తి మీదుగా సీఎం రావు ఫంక్షన్ హాల్ చేరుకోగానే మేళతాళాలతో కార్యకర్తలు గజమాలతో స్వాగతించారు అనంతరం ఫంక్షన్ హాల్లో నాయకులు కార్యకర్తల సమక్షంలో సంబరంగా కేక్ కట్ చేసి ఖానాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజీద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు అనంతరం ఏడవ వార్డు కౌన్సిలర్ నిమ్మల రమేష్ పుట్టినరోజు సంబరాలు జరిపి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభింపచేసుకున్నారు పద్మావతి నగర్ యూత్ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు అనంతరం ఖానాపూర్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు ప్రజాప్రతినిధులు నాయకులు శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సన్మానించారు

**పారిశుద్ధ కార్మికులకు బట్టల పంపిణీ**

ఖానాపూర్ పట్టణ మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకల్లో బట్టలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల పట్టణ పార్టీ అధ్యక్షులు జంగిలి శంకర్ గొర్రె గంగాధర్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్. రాజుర సత్యం జన్నారం శంకర్ యూసఫ్ ఖాన్ కదార్ల గంగ నరసయ్య మధుర సత్యనారాయణ అమానుల్లా ఖాన్ జమాల్ కురిసి శ్రీపాద శేషాద్రి సర్పంచులు రాజు నాయక్ ప్రశాంత్ రెడ్డి నవీన్ యాదవ్, మదిరే సత్యనారాయణ బాల సంకుల రాజేందర్ నాతో పాటు ప్రాంత వాసులు పాల్గొన్నారు అనంతరం కడెం మండలంలో అక్కడి మండల పార్టీ అధ్యక్షులు బొడ్డు గంగన్న మార్కెట్ కమిటీ చైర్మన్ పడగల భూషణ్ సతీష్ రెడ్డి తో పాటు తదితర గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిపి రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వెల్లడి ఖానాపూర్ నియోజకవర్గంలోని ఖానాపూర్ పాత తాలూకా మండల ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని తన పుట్టినరోజు వేడుకల్ని ఇంత ఘనంగా నిర్వహించి పలు కార్యక్రమాలు చేపట్టి అభిమానాన్ని చాటుకోవడం సంతోషం కలిగించింది అని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వెల్లడించారు ఖానాపూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు ఈ అభిమానం జీవితంలో మర్చిపోలేను అన్నారు

# మొదట తమకు భూములు చూపించండి

**అన్యాయంగా తమ భూము లను లాక్కోకండి**

**అటవీ అధికారులపై తిరగబడ్డ నచ్చన్ ఎల్లాపూర్ గోండుగుడా గిరిజనులు**



**కడెం,జూన్ 16(ప్రజా జ్యోతి):** మొదట తమకు భూములు చూపించండి. తాము ఏళ్ల తరబడి సాగు చేస్తున్న అటవీ భూములను లాక్కుంటున్నా అటవీశాఖ అధికారులు ముందుగా తమకు వ్యవసాయం కోసం భూములు చూపించి ఆతర్వాత తమ భూములను లాక్కోవాలని డిమాండ్ చేశారు. కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ ఆదివాసి గిరిజనులు అటవీశాఖ అధికారులపై సిబ్బందిపై తిరగబడ్డారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు లాక్కొని తమ భూములలో మొక్కలు నాటడం వల్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లా కడెం మండలం మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు వ్య వసాయ భూములు హద్దులు చూపిస్తుండగా అడ్డుకొని త మ గ్రామ గిరిజనులకు భూ ములు కేటాయించిన తర్వాతే హద్దులు చూపించాలని నచ్చన్ ఎల్లాపూర్ గోండు గూడ ఆది వాసి గిరిజనులు డిమాండ్ చేశారు. పోడు భూములను సాగు చేసుకుంటున్నా ఆదివాసి గిరిజనులను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 20 మంది ఆందోళన కారులను అదుపులోకి తీసుకొని జన్నా రం మండలం ఇందన్ పల్లి అ టవీ రేంజ్ కార్యాలయానికి అ టవీశాఖ అధికారులు వారి వాహనలలో తరలించారు. ఎఫ్డిఓ శివకుమార్, సిఐలు సత్యనారాయణ, సమ్మయ్య దాదాపు 150 మంది పోలీస్, అటవీశాఖ అధికారులు, సి బ్బంది భారీ బందోబస్తు మ ధ్య మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు కేటాయించిన భూములను చదును చేస్తూ రెవెన్యూ అధికారులు హద్దు రాళ్లను పాతుతూ వారి పట్టా నెంబర్లను వేస్తున్నారు. అయితే ఈ భూములలో కొంత నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు గతంలో అరుకులు కొట్టుకొని తాము సాగు చే శామని, అట్టి భూములను తమకు కేటాయించిన తర్వాతే మైసంపేట్ గ్రామస్తులకు భూ ములు పంపిణీ చేయాలని నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూ డ గిరిజనులు డిమాండ్ చేస్తు న్నారు. భారీ బందోబస్తు మ ధ్య మంగళ వారం భూము లకు హద్దులు ఏర్పాటుచేసి పంపిణీ చేసిన తర్వాత మళ్లీ నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు గతంలో ఉన్న భూములను తాము సాగు చేసుకుంటామని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేప థ్యంలో మైసంపేట్ పునరా వాస గ్రామస్తులకు కేటాయించిన భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మైసంపేట్ గిరిజనులు ప్రభు త్వాన్ని కోరుతున్నారు.

# సిద్ధమైన పొలాలు... మొఖం చాటేసిన వర్షాలు....

తొలి వానల కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్న అన్నదాతలు దుక్కులు దున్ని, విత్తనాలు సిద్ధం చేసినా ముందుకు సాగని సాగు

నిర్మల్ జిల్లాలో వర్షాధార వ్యవసాయంపై తీవ్ర ప్రభావం మామడ మండలం ప్రజాజ్యోతి ప్రతినిధి ఎలిగేటి వంశీ కృష్ణ నేత

ఆలస్యమవుతున్న నైరుతి రుతుపవ నాలతో రైతుల్లో పెరుగుతున్న ఆందోళన







మామడ జూన్ 17 ( ప్రజా జ్యోతి)"రైతు కళ్లలో ఆశ... ఆకాశంలో మేఘాల కోసం ఎదురుచూపు" అన్న పరిస్థితి ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కనిపిస్తోంది. వానాకాలం ప్రారంభమైనా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సాగుకు సిద్ధమైన పొలాలు వర్షపు చినుకుల కోసం ఎదురు చూస్తుండగా, రైతుల ఆశలు మాత్రం ఆకాశానికే పరిమితమవుతున్నాయి.నైరుతి రుతుపవనాల ప్రభావం మందగించడంతో జిల్లాలో వ్యవ సాయ కార్యకలాపాలు ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదు.

**సిద్ధమైన పొలాలు... మొదలుకాని సాగు:**

జిల్లాలోని మామడ, లక్ష్మణ్ చందా, సోన్, ఖానాపూర్, కనకాపూర్, పెంబి, తదితర మండలాల్లో రైతులు ఇప్పటికే పొలాలను దున్ని సాగుకు సిద్ధం చేశారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో విత్తనాలు వేయాలా? ఇంకొన్ని రోజులు వేచి చూడాలా? అనేసందిగ్ధంలో ఉన్నారు.ప్రత్యేకించి వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, సోయాబీన్ సాగు చేసే రైతులు వర్షాల ఆలస్యంతో తీవ్ర ఆందోళనచెందుతు న్నారు.

**అప్పులు చేసి పెట్టుబ డులు... చేతిలో ఆందోళన:**

ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా రైతులు అప్పులు చేసి విత్త నాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేశారు. ట్రాక్టర్లతో దుక్కులు దున్నించి పొలాలను సిద్ధం చేశారు. కానీ వర్షాలు కురవకపోవ దంతో పెట్టుబడులు పెట్టిన రైతులు ఆందోళనలో ఉన్నారు. "పొలం సిద్ధంగా ఉంది... విత్తనం సిద్ధంగా ఉంది... కానీ వాన మాత్రం రావడం లేదు" అంటూ పలువురు రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని రోజులు వర్షాలు ఆలస్యమైతే సాగు కాలం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు..

**చెరువుల్లో నీటి నిల్వలు:**

ఆందోళనకరం

జిల్లాలోని అనేక చెరువులు, కుంటలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో నిం డలేదు. గత వేసవిలో తీవ్ర ఎండల కారణంగా నీటి మట్టాలు పడి పోవడంతో ప్రస్తుతం సాగునీటి పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు వర్షాలు లేకపో వడంతో భూగర్భ జలాల పునరు ద్ధరణ కూడా జరగడం లేదు.ముఖ్యంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడిన మండలాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారు తోంది.

**నైరుతి రుతుపవనాల కోసం ఎదురుచూపు**

సాధారణంగా జూన్ మొదటి లేదా రెండో వారంలో జిల్లాలో వ్యవసాయ పనులు ఊపందుకుంటాయి. కానీ ఈసారి నైరుతి రుతుపవనాలు ఆశిం చిన స్థాయిలో చురుకుగా లేకపోవ డంతో వర్షాలు ఆలస్యమవుతు న్నాయి. దీంతో రైతులు ప్రతిరోజూ వాతావరణ పరిస్థితులను గమనిస్తూ ఆశగా ఎదురుచూస్తున్నారు. వాతావ రణ శాఖ అంచనాల ప్రకారం రానున్న రోజుల్లో వర్షాలు కురిసేఅవ కాశం ఉన్నప్పటికీ, రైతులు మాత్రం త్వరగా వర్షాలు కురవాలని కోరుకుం టున్నారు.

**వ్యవసాయ శాఖ అప్రమత్తంలి**

ప్రస్తుత పరిస్థితులను వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పరిశీలి స్తున్నారు. రైతులు తొందరపడి విత్త నాలు వేయకుండా స్థానిక వాతావ రణ పరిస్థితులను గమనించి నిర్ణయం తీసు కోవాలని సూచిస్తు న్నారు. వర్షాలు స్థిరంగా కురిసిన తర్వాతే పూర్తి స్థాయి విత్తనాలు వేయడం మంచిదని నిపుణులు సూచి స్తున్నారు.

**' మేఘాల కోసం ఎదురు చూపు**

ఒకవైపు ఎండల తీవ్రత, మరోవైపు ఆలస్యమవుతున్న వర్షాలు... ఈ రెండు కారణాలతో జిల్లాలోని రైతాంగం ఆందోళనలో ఉంది. పొలాలు సిద్ధంగా ఉన్నాయి... నాగళ్లు సిద్ధంగా ఉన్నాయి... విత్తనాలు గోదా ముల్లో సిద్ధంగా ఉన్నాయి... కానీ ప్రకృతి కరుణ కోసం రైతు కళ్లు మాత్రం ఇంకా ఆకాశం వైపే చూస్తు న్నాయి. వాన చినుకులు పడితేనే పొలాల్లో పచ్చదనం పరుస్తుంది... రైతు ముఖంలో చిరునవ్వు వికసి స్తుంది. అప్పటి వరకు భద్రాద్రి. జిల్లాలో అన్నదాతల నిరీక్షణ కొనసా గుతూనే ఉండనుంది.

## పార్లమెంట్ సభ్యునికి పెద్దగూడ గ్రామస్థుల మొర



సోనాల, జూన్ 16 ( ప్రజాజ్యోతి ):సోనాల మండలంలోని పెద్దగూడ గ్రామస్తులు వర్షాకాలంలో వారి గ్రామానికి వెళ్లడానికి గ్రామస్తులకు చాలా ఇబ్బందిగా ఉంటుంది అని, కావున గ్రామానికి బ్రిడ్జి పక్కన సిసి రోడ్ మరియు సైడ్ వాల్ నిర్మించాలని, గ్రామస్తులందరూ కోరడం జరిగింది. గ్రామస్తుల కోరిక మేరకు తప్పకుండా సాంక్షన్ చేస్తానని గ్రామస్తులకు అదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గోడిశీ నగేష్ హామీ ఇవ్వడం జరిగింది. ఇందుకు గాను గ్రామస్తులందరూ పార్లమెంట్ సభ్యునికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారిని శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చింతలబోరి గ్రామ ఉపసర్పంచ్ డీగోడే విష్ణు మరియు గ్రామ పటేల్ ,కరోబర్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కు జన్మదిన శు భాకాంక్షలు తెలిపిన సీఐ,కమిషనర్ లు



ఖానాపూర్ జూన్ 16 (ప్రజా జ్యోతి ) ఖానాపూర్ శాసనసభ్యులు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెడమ బొజ్జు పటేల్ జన్మదిన వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ కటకం సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ లు కలిసి మంగళవారం మధ్యాహ్నం శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా యువజన క్రీడల అధి కారిగా ఏదయానంద రెడ్డి



ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 16, (ప్రజా జ్యోతి)నూతన జిల్లా యువజన, క్రీడల అధికారిగా ఏ.దయానంద్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం ఆవరణలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాను మర్యాదపూర్వ కంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్ట ర్ శుభాకాంక్షలు తెలుపుతూ, శాఖ కార్యకలాపాలను పారద ర్శక తతో, సమర్థవంతంగా విధులను నిర్వహించాలని సూచించారు.

## ప్రజా నాయకుడు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బర్త్‌డే వేడుకలు

నేరడిగొండ జూన్ 16 (ప్రజా జ్యోతి): ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. నేరడిగొండ మండల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని ఆయనకు శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రజాప్రతినిధులు, వివిధ



గ్రామాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ కల సాకారం దిశగా అడుగులు

**భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తాం జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**డిఫెన్స్‌కు 1,500 ఎకరాలు రన్ వే విస్తరణకు మరో 80 ఎక రాలు**

**ఎంపీ, ఎమ్మెల్యే, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష**





**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 16, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జాయింట్ యూజర్ (డిఫెన్స్-సివిల్) ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను పూర్తి స్థాయి పారదర్శకతతో చేపడతామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, బెంగళూరుకు చెందిన ఎయిర్‌ఫోర్స్ ఉన్నతా ధికారు లు, రాష్ట్ర సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డితో కలిసి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమా వేశానికి ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన, మైక్రో లెవెల్ సర్వే నిర్వహించి, రన్ వేవిస్తరణతో పాటు సాంకేతిక అంశాలపై చర్చించిపలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు విమానాశ్రయ ఏర్పాటుకు అవ సరమైన భూసేకరణ చర్యలను వేగవంతం చేశామన్నారు. ఇప్పటికే 700 ఎకరాల భూసే కరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని, అదనంగా డిఫెన్స్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్ (ఎయిర్ ట్రైనింగ్ ఇన్‌స్టి ట్యూట్) కోసం 1,500 ఎకరాలు, సివిల్ ఏవియేషన్ రన్‌వే విస్తరణ కోసం మరో 80 ఎకరాలను కేటాయించేందుకు ప్రాథమిక ఆమోదం లభించిందని వివరించారు. జియో కోఆర్డినేట్ల ఆధారంగా భూసేకరణ ప్రక్రియను అత్యంత పారద ర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేసిన కలెక్టర్, సీఎంఓ కార్యాలయం, ప్రజాప్రతి నిధుల సూచనల మేరకు త్వరితగతి న భూసేకరణ పూర్తి చేసి రక్షణ శాఖ, ఎయిర్ పోర్ట్ అథారి టీకి భూములను అప్పగిస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకు సివిల్ ఏవియేషన్‌తో పాటు డిఫెన్స్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ రావడం ప్రజలకు ఒక చారి త్రాత్మక అవకాశమని పేర్కొన్నారు. ఢిల్లీ స్థాయిలో ఇప్పటి కే చర్చలు, ఎంపీ గోడం నగేష్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సం బంధించినలొ కేషన్ల పరిశీలన విజయవంతంగా పూర్తయిందని ఎంపీ గోడం నగేష్ తెలిపారు. గత మార్చిలో ఢిల్లీ లో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డిలతో ఈ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించామని, మే 15 న కేంద్ర ఉన్నతస్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన కూడా నిర్వహించిందని గుర్తుచేశారు. రక్షణ శాఖ కోరి న 1,500 ఎకరాల భూమి సేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వాలు సంపూర్ణ సమన్వయంతో పనిచేస్తు న్నాయని చెప్పారు. జిల్లా అధికారులతో కలిసి మ్యాప్‌ల ఆధారంగా మైక్రో లెవెల్ సమీక్ష నిర్వహించామని, ప్రాజెక్టు వేగవంతానికి నేటి సమావేశం కీలక ముందడుగు అని పేర్కొన్నారు

**దశాబ్దాల కల నెరవేరబోతోంది**

**ఎమ్మెల్యే పాయల శంకర్**

జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణపై నేటి సమావేశంతో స్పష్టత వచ్చిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి మొత్తం1,840 ఎకరాలు అవసరమవుతాయని, ఇందులో 1,500 ఎకరాలను రక్షణ శాఖకు అప్పగించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రా నికి లేఖ రాసిందని తెలిపారు. ఇప్పటికే 360 ఎకరాలు రక్షణ శాఖ పరిధిలో ఉండగా, రన్‌వే విస్తరణ కోసం మరో 80 ఎక రాలను సేకరించాల్సి ఉందన్నారు. గతంలో జారీ చేసిన 700 ఎకరాల జీవో ప్రకారం పనులు ప్రారంభ మయ్యాయని, మిగిలిన 800 ఎకరా అనుమతుల ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని చెప్పారు. తదుపరి విధాన పరమైన నిర్ణయాల కోసం త్వరలో ఎంపీ నేతృత్వంలో ఢిల్లీలో ఉమ్మడి సమావేశం జరగ నుందని, ఇందులో రాష్ట్ర ము ఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రాజ్‌నాథ్ సింగ్‌లతో చర్చలు నిర్వహించను న్నట్లు వెల్లడించారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుతో ఆదిలాబాద్ ప్రజల దశాబ్దాల కల నెరవేరబో తోందని, జిల్లా అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుచుకోనున్నా యని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశం, క్షేత్రస్థాయి పరిశీలనలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్. రాజేశ్వర్, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధి కారులు జేపీ సబర్వాల్, ఎస్.జి. హెగ్డే, ఎస్.కె. రెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్, ల్యాండ్ సర్వే ఏడీ ప్రభాకర్, తహశీల్దార్లు శ్రీనివాస్, గోవింద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను వంద శాతం సాధించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 16, (ప్రజా జ్యోతి)**జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ఒక ఉద్యమంలా చేపట్టి, వ్యవసాయ, ఉద్యాన, సహ కార శాఖల సంయుక్త కృషితో 2026-27 సంవత్సరానికి ని ర్దేశించుకున్న సాగు లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయా లని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయిల్ పామ్ సాగు విస్తీ ర్ణం పెంపు, రైతు వేదికల ద్వారా ఎరువుల పంపిణీ ఏర్పాట్ల పై ఆయన అధికారులతో ఉన్నత స్థాయి సంయుక్త సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా అత్యంత లాభదాయకమైన పంట అని, దీనిపై ఉద్యానవన శాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ ఏడాది ఏమాత్రం అలసత్వం వహించ కుండా మండల వ్యవసాయ అధికారుల వారీగా ప్రత్యేకల క్ష్యాలను నిర్దేశించి పర్యవేక్షిం చాలన్నారు. నీటి వసతి ఉండి ఆసక్తి చూపే రైతులను గుర్తించి, వారి దరఖాస్తులను స్వీ కరించి ఉద్యానవన శాఖకు సమర్పించాలని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన డ్రి ప్ పరికరాలు, నాణ్యమైన ఆయిల్ పామ్ మెటీరియల్స్ స కాలంలో అందేలా చూడాలని ప్రియునిక్ ఇండియా ప్రతిని ధులను, అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలోని సొసైటీలు, పిఎసిఎస్ కేంద్రాల ద్వారా రైతు వేదికలలో యూరియా, ఇతర ఎరువులను పంపిణీ చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాబోయే వారం లేదా పక్షం రోజుల్లోగా మారుమూల ప్రాంతాల రైతులకు సైతం స కాలంలో ఎరువులు అందేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేసు కోవాలన్నారు. ప్రస్తుతం సొసై టీల ద్వారా సాగుతున్న సరఫ రాలో ఎక్కడా అలసత్వం ప్రద ర్శించకుండా, సమయానికే ఎ రువుల కేటాయింపులను తీసుకుని డిజిటల్ యాప్ ద్వారా రైతులకు విజయవంతంగా అందించాలన్నారు. ఎరువుల ఇండెంట్, ప్లేస్‌మెంట్ లేదా డిస్ట్రిబ్యూషన్‌లో ఎలాంటి లోపాలు తలెత్తినా, రైతులకు ఇబ్బంది కలిగించినా సంబంధిత అధికారుల పై కఠిన చర్యలు ఉంటాయని తీవ్రంగా హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఫార్మర్ రిజిస్ట్రీ'లో జిల్లాలోని ప్రతి రైతు వివరాలను ఎలాంటి తప్పుల్లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో సోయాబీన్, పత్తి విత్త నాలు రైతుల అవసరాలకు సరిపడా విరివిగా అందుబా టులో ఉన్నాయని, విత్తన పం పిణీ సజావుగా సాగాలన్నా రు. ప్రస్తుత వర్షాభావ పరిస్థి తులను దృష్టిలో ఉంచుకుని సోయాబీన్, కంది వంటి ప్రత్యామ్నాయ పంటలపై సైతం రైతులు దృష్టి సారించేలా చూడాలని, అందుకు అవసరమైన విత్తన ప్రణాళికలను ముందే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. అనం తరం తెలంగాణ విత్తన అభి వృద్ధి సంస్థకు సంబంధించిన 2 కిలోల కంది విత్తనాలను, పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా జిల్లాలో జొన్న కొనుగోళ్ల ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసిన నేపథ్యంలో వ్యవసాయ మా ర్క్ ఫెడ్, రవాణా, సహకార, ఇతర సంబంధిత శాఖల అధి కారులను కలెక్టర్ శాలువాతో సత్కరించి అభినందించారు ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ వంశీ కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దేవి నరసయ్య, అసి స్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శ్రీధర స్వామి, ఎల్డిఎం ఉత్పల్ కుమార్, పీడీ ఆత్మ రాంకిషన్, డిఎం మార్క్‌ఫెడ్ మహేష్ కుమార్, ప్రియునిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఏరియా మే నేజర్ నవీన్, వివిధ మండలాల ఏడీఏలు, ఏఓలు, ఎంఏఓలు, ఏఈఓలు, పిఎసిఎస్ సీఈ ఓలు, తదితరులు పాల్గొన్నారు.

# చినుకు పడితే చాలు... చీకటే దిక్కు

**గాలికి, వానకు కరెంట్ కట్**

**పక్క ఊళ్లలో వెలుగు, ఇక్కడ చీకట**



**ఆసిఫాబాద్ జూన్ 16 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం లోని ఖమన గ్రామం లో చిన్నపాటి వర్షం పడ్డా, గాలొచ్చినా ఖమన గ్రామంలో కరెంట్ కట్ అవుతోందని గ్రామస్తులు మండిపడుతున్నారు. గంటల తరబడి చీకట్లోనే మగ్గాల్సి వస్తోందని వాపోయారు. పక్క ఊళ్లలో కరెంట్ ఉన్నా ఖమనలో మాత్రం వెంటనే పోతోందని ఆరోపించారు. ఇది కొత్త కాదని, ఏళ్ల తరబడి ఈ సమస్య వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో పిల్లల చదువులు, రైతుల పనులు, చిన్న వ్యాపారాలు అన్నీ దెబ్బతింటున్నాయని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు బాగు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. నిరంతర విద్యుత్ ఇవ్వాలని కోరారు.

## గంజాయి కై రాత్రి సమయా ల లో ప్రత్యేక తనిఖీలు నిర్వ హించాలి

**రాత్రి, పగలు బీట్ వ్యవస్థ పటిష్టంగా జరగాలి**

**సిసిటిఎన్ఎస్ నవీకరణ ఎప్ప టికప్పుడు జరగాలి**

**వర్టికల్ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలి**

**రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వ హిం చాలి**

**నేరాల నియంత్రణకు కృషి చేయాలి**

**జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష సమా వే శం**

**ఉత్తమ ప్రతిభ కనబరిచిన 40 మంది అధికారులకు సి బ్బందికి ప్రశంస పత్రాలు అందజేత**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్**







**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 16, (ప్రజా జ్యోతి)** జిల్లా వ్యాప్తంగా రాత్రి, పగలు గస్తీ నిర్వహిస్తూ ఆర్థిక నేరాలను జరగకుండా పటిష్టమైన బీట్ వ్యవస్థను నిర్వహించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహా జన్ ఐపీఎస్ సూచించారు. మంగళవారం స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా పోలీసు అధికారులతో నేర స మీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.నెల రోజులలో నమోదైన కేసుల వివరాలను వాటి స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకుని సంబంధిత సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, మా దకద్రవ్యాలు లేకుండా ప్రతిష్ట మైన చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా రాను న్న వర్షాకాలం దృష్ట్యా ఎలాంటి అత్యవసర సమయంలో నై నా స్పందించే విధంగా డి డి ఆర్ ఎఫ్ బృందం అందుబా టులో ఉండాలని, మండలంలో ఎస్ఐ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటూ అప్ర మత్తమై ఉండాలని సూచిం చారు. సిబ్బంది విధులలో క్ర మశిక్షణను పాటించాలని, వి ధులలో అనవసరంగా గైర్హాజ రైన సిబ్బంది పట్ల శాఖా పర మైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయా లలో ప్రత్యేకంగా బస్సులలో గంజాయి తనిఖీలు నార్కోటి క్ జాగిలం ద్వారా జరగాలని సూచించారు. రౌడీ షీటర్లను సస్పెక్ట్ షీటర్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పరిరక్షించాలన్నారు. పోలీస్ స్టేషన్లో 5ూ విధానాన్ని అమలు చేసి, వర్టికల్ విధా నంతో స్టేషన్ నిర్వహణ చేప ట్టాలని తెలిపారు. సి సి టి ఎన్ ఎస్ లో ఎప్పటికప్పుడు నవీకరణ జరుగుతూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడా లన్నారు. సోషల్ మీడియా పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తే ఇలా ప్రవర్తించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేష న్లలో నమోదైన కేసుల వివ రాలను క్షుణ్ణంగా అడిగి తెలు సుకుని బాధితులకు న్యా యం జరిగేలా దర్యాప్తు కొనసాగించాలని, దర్యాప్తు వేగ వంతంగా జరగాలని, నిందితులకు శిక్షపడేలా చార్జిషీట్ దాఖలు చేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో అద నపు ఎస్పీ అడ్మిన్ పి మౌనిక ఐపీఎస్, ఉట్నూర్ ఎఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఆదిలా బాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్ర వర్ధన్, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, డిసిఆర్బి, ఐటి కోర్, ఎన్ఐబి, కమ్యూనికేషన్, ఫింగర్ప్రింట్, రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అయిన నేపథ్యంలో

**బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, వసతి కల్పించాలి:**

**అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ ..**




**బాసర జూన్ 16 (ప్రజా జ్యోతి)** బాసర ట్రిపుల్ ఐటీలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అయిన సందర్భంలో మళ్ళీ తమ నాసిరకం ఆహారం అందించే కార్యక్రమం ప్రారంభం అయ్యిందని ఎన్నో ఆశలతో గొప్ప లక్ష్యాలతో ట్రిపుల్ ఐటీకి వచ్చే విద్యార్థులకు మళ్ళీ నాసిరకం ఆహారం,బొద్దిశీకల భోజనాలు మళ్ళీ ప్రారంభం అయ్యాయని ఆరోపించారు..విద్యార్థులు బ్రేక్ ఫాస్ట్ లో బొద్దింకలు వచ్చిందని పిర్యాదు చేస్తే ఆ మెస్ కాంట్రాక్టు సంస్థ మీద బాధ్యుల మీద కనీస చర్యలు తీసుకోకుండా తిరిగి ఇంచార్జ్ వీసీ గోవర్ధన్ మురళి దర్శన్లు పని గట్టుకుని బొద్దిశీకను గుర్తించడానికి కమిటీ వేయడం హాస్యస్పదం అని అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ అన్నారు సమస్యలు వస్తె పరిష్కారానికి కృషి చేసిన అధికారులను చూసాం కానీ సమస్యలను సృష్టిస్తున్న వారే సమస్యలను పరిష్కారం కోసం కమిటీ సభ్యులుగా ఉండడం వింతని అన్నారు పోస్టు అనేది వీసీ పోస్ట్ అని దానికి బాసర ట్రిపుల్ ఐటీలో ఉన్న పెర్మనెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగులను పక్కన పెట్టి లతో కమిటీ వేస్తే ఆ కమిటీ వీసీ గోవర్ధన్ తన ముడుపులు తీసుకుని ఇచ్చిన మెస్ కాంట్రాక్టర్ లను కాపాడే ప్రయత్నం తప్పితే ఏమీ చేయలేదని అన్నారు విద్యార్థి సంఘాలుగా గతంలో ఆరోపణలు ఎదుర్కొన్న వారికి, బ్లాక్ లిస్ట్ లో ఉన్నవారికి ఇవ్వొద్దని పోరాటం చేస్తే,గతంలో ఫుడ్ పాయిజన్ ఘటనలు బాసర ట్రిపుల్ ఐటీలో చేసిన వారికే తిరిగి మెస్ కాంట్రాక్టులు ఇచ్చిన ఘనులు ఇంచార్జ్ వీసీ గోవర్ధన్, మురళి దర్శన్ లు అని ఆరోపించారు గతంలో బాసర ట్రిపుల్ ఐటీలో ఇద్దరు మెస్ కాంట్రాక్టర్ల మధ్యలో వచ్చిన ఆర్థిక వ్యవహారాల్లో తేడాల విష యం లో ఇరువురు ఫుడ్ పాయిజన్ ఘటనలు చేసి విద్యార్థులు ఆసుప త్రి పాలు కావడానికి కుట్ర చేసిన వారికే తిరిగి మెస్ కాంట్రాక్టులు ముడుపులు తీసుకుని ఇచ్చిన చరిత్ర వీసీ,లకు దక్కిందని అన్నారు విద్యార్థులు తమ నాసిరకం ఆహారం మీద యాజమాన్యంకు పిర్యాదు చేస్తే తిరిగి ఆపిర్యాదును స్వీకరించి ఇపుడు ఆకాంట్రాక్టర్ కు కాపాడ డానికి కొత్త డ్రామాకు తెరలేపిన సందర్భం కనిపిస్తుందని ఆరోపిం చారు ఎప్పుడూ సమస్యలు వచ్చిన బాసర ట్రిపుల్ ఐటీనీ ఇంచార్జి వీసీ గోవర్ధన్ కు నడపడం చేతకాక బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ను,అక్కడ పని చేస్తున్న కొంత మంది ఉద్యోగులను,యూని వర్సిటీ బాగుకోసం, విద్యార్థుల హక్కుల కోసం,బాసర ట్రిపుల్ ఐటీ లో జరు గుతున్న అన్యాయాలు,అక్రమాల మీద కొట్లాడుతున్న అక్కడి విద్యార్థి సంఘం, మరియు బాసర ట్రిపుల్ ఐటీ పరిరక్షణ కోసం మాట్లా డుతున్న వారు,స్థానిక మీడియా సంస్థలు,ప్రతినిధుల మీద దృశ్పచ రం చేయడంలకు అలవాటుగా మారిందని ఆరోపించారు చిన్న చిన్న సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు అమ్ముకున్న చరిత్ర వీరిద్దరికి దక్కిందని అన్నారు ఉద్యోగాలు అమ్ముకున్నరాని దినపత్రికల్లో ప్రత్యేక కథనాలు,వారి బాధలు,బాధితుల ఆర్త నాదాలు వీసీ గోవర్ధన్ కు కనిపిస్తలేవా అని ప్రశ్నించారు?? గతంలో కూడా విద్యార్థి సంఘం నేతల మీద అలిసిరి గోవర్ధన్ ఇదే రకంగా దృశ్పచరశీ చేసిన చరిత్ర ఆయనది అని వాటితో పాటు హౌస్ కీపింగ్,ల్యాబ్ అసిస్టెంట్,గెస్ట్ ఫ్యాకల్టీ లలో కూడా తమకు నచ్చిన ముడుపులు ఇచ్చిన వారికే ఉద్యోగాలు ఇస్తున్నారని ఆరోపించారు వారు చేసిన తప్పులకు కప్పిపుచ్చుకోవడానికి ఎన్నో రకాల ప్రయత్నలు చేస్తున్నారని అన్నారు ప్రభుత్వం రెండు కమిటీలు నిజనిర్ధారణ కోసం వేస్తే ఆ కమిటీ ల ముందు మేక వన్నె పులుల లెక్క కుప్పిగం తులు వేసి నటించారని ఆరోపించారు ఎన్నో గొప్ప ఆలోచనలతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇంచార్జి వీసీ పోస్ట్ ను గోవర్ధన్ కు ఇస్తే దానికి ఫాలో కాకుండా ప్రభుత్వ లక్ష్యానికి చేరువ కాకుండా ఆయన అకడమిక్ ను మరచిపోయి ఒక ప్రైవేట్ భజన బృందాన్ని ఏర్పాటు చేసుకుని ప్రభుత్వానికి అప్రతిష్ట పాలు చేసే విధంగా,బాసర ట్రిపుల్ ఐటీనీ నాశనం చేయడానికి కుట్ర చేస్తున్నా రని అనుమానం వ్యక్తం చేశారు సమస్య వచ్చినపుడు పక్కదారి పట్టించడం,కులం తోలు కప్పుకుని బ్రతకడం వీరికి రివాజుగా మారిందని ఆరోపించారు నచ్చిన వారికి నజరానా నచ్చని వారికి జరిమానా అన్న విధంగా వీరి వ్యవహార శైలి ఉందని గతంలో 18 ఏళ్లలో జరగని దురాగతాలు వీళ్ళు 18 నెలల్లోనే అన్ని విధాలుగా చేసి అన్నిశీటిలో ఆర్థిక దోపిడీకి పాల్పడ్డారని,విద్యార్థులు ప్రశ్నిస్తే చెరువు దగ్గర ఉండి చెరువులో చేపలు పట్టుకొని ఎట్లా తినకుండా ఉంటామని డైలాగులు కొట్టిన భావ దరిద్రం విరిదాని అన్నారు నిత్యం ఉద్యోగుల మధ్య ఒకరిమీద ఒకరికి ద్వేషం పెంచడం దుర్భాషలు ఆడుతూ వారిని కించపరచడం తప్పితే వీరు చేసింది ఏమిలేదని కొత్తగా అడ్మిషన్ల కౌన్సిలింగ్ కు వచ్చే పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి,విద్యాశాఖ మంత్రి ఫోటోలతో పిల్లలకు వెల్ కమ్ బ్యానర్ లు కట్టి ఇన్వైట్ చేయాలి కానీ అవన్నీ మర్చిపోయి ఇరువురు ట్రిపుల్ ఐటీ బాసర లో వాళ్ళ పర్సనల్ ప్రమో షన్ కోసం కట్ అవుట్లు పెట్టీ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నా రని ఆరోపించారు ప్రభుత్వానికి బాసర ట్రిపుల్ ఐటీలో జరుగుతున్న అన్ని విషయాల మీద సంపూర్ణ అవగాహణ ఉందని అందులో భాగంగానే ఒక వికెట్ పడిపోయిందని మిగతా వికెట్లు రెడీగా ఉన్నాయని అన్నారు అలాగే అడ్మిషన్ల ప్రాసెస్ లో జరుగుతున్న విష యాలు కూడా రకరకాల అనుమానాలకు తావు ఇస్తున్నాయని ఆరో పించారు వాటి మీద నిర్దిష్ట సమాచారంతో త్వరలో మాట్లాడుతామని తెలిపారు..

## సిరికొండ మండలం అభివృద్ధి ప్రదాత బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గ్రామం గ్రామం అభివృద్ధి చేస్తు న్న ఎమ్మెల్యే

**ఘనంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలు**

**బోథ్ నియోజకవర్గం లో మళ్లీ ఎగిరేది గులాబీ జెండా**



**సిరికొండ, జూన్ 16, (ప్రజా జ్యోతి)** సిరోకొండ మండలంలోని బోథ్ నియోజకవర్గ పరిధిలోని గ్రా మాలన్నీ అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అని సిరికొండ బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఓరగంటి పెంటన్న, సూర్యకాంత్, జాదవ్ రోహి దాస్, సూర్యకాంత్ అన్నారు. మంగళవారం సిరికొండ మండల కేంద్రం లోని గాంధీ చౌక్ వద్ద బోథ్ ఎమ్మెల్యే అనిల్ జా దవ్ జన్మదినం సందర్భంగా సి రికొండ మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సిరికొండ మండలంలోని మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నా రని అన్నారు. ఎమ్మెల్యే అందరిని కలుపుకుంటూ ముందుకు పోతున్నాడని రానున్న రోజుల్లో బోథ్ నియో జకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్య క్తం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎ మ్మెల్యేలు భారీ మెజార్టీతో గెలిచి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ను మళ్లీ ముఖ్యమంత్రి చేయడం ఖాయం అన్నారు.

# సీసీఐ పునః ప్రారంభంపై ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించాలి

మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 16, (ప్రజా జ్యోతి)**ఆదిలాబాద్ జిల్లాలో సీసీఐ సిమెంట్ పరిశ్రమ పునఃప్రారం భం కోసం సీసీఐ సాధన కమిటీ అనేక సందర్భాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తు లు చేసినప్పటికీ ఇప్పటికీ స్పష్టమైన చర్యలు కనిపించ డం లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు.మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ పునఃప్రారంభ విష యంలో చూపిస్తున్న నిర్లక్ష్యా నికి నిరసనగా సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలో “హలో యువత చలో సీసీఐ పరిశ్రమ” కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. నల్ల జెండాలతో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి సీసీఐ పరిశ్రమ వరకు యువత, నాయకులు భారీగా పాల్గొని ర్యాలీ నిర్వ హించారు. అనంతరం సీసీఐ పరిశ్రమ ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల ఎస్కార్ట్ మధ్య ఈ కార్యక్రమం కొనసాగింది. పరిశ్రమలో స్క్రాప్‌గా మార్చిన ప్రాంతాలను మాజీ మంత్రి జోగు రామన్న, సీసీఐ సాధన కమిటీ సభ్యులతో కలిసి పరి శీలించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కళ్లముందే యువత ఆశలు చెదిరిపోతుంటే అండగా నిలవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వలాభాల కోసం పరిశ్రమను తుక్కుగా మా రుస్తున్నాయని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లా పరిశ్ర మలు లేని వెనుకబడిన జిల్లాగా ఉందని, సీసీఐ పరిశ్రమ పునః ప్రారంభమైతే వేలాది మంది యువతీ యువకులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకా శాలు లభిస్తాయని పేర్కొన్నారు. కేంద్ర నాయకులు బహిరంగ సభల్లో ఇచ్చిన హామీలపై స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు ఎందుకు మౌనం వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్క్రాప్ టెండర్ల వ్యవహారంపై తాము ప్రశ్నించినప్పటికీ ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. భూ నిర్వాసి౦లు తమ భూములు కోల్పోయి ఇబ్బందులు పడుతుండగా, వందేళ్లకు సరిపడా ముడి సరుకు ఉన్నప్పటికీ పరిశ్రమ పునః ప్రారంభానికి ఒత్తిడి తేవడంలో ప్రజాప్రతినిధులు వి ఫలమయ్యారని విమర్శించారు. సీసీఐ అమ్మకాన్ని ప్రోత్స హించడం ద్వారా యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడం తగదన్నారు. రానున్న రోజుల్లో ఆదిలాబాద్ ప్రజలు దీనిపై గట్టి తీర్పు ఇస్తారని హె చ్చరించారు. సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో జరుగు తున్న ఉద్యమానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. గతంలో కూడా ఎంపీ, ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. సాధన కమిటీ సభ్యులతో కలిసి కేంద్ర మంత్రులను కల వడం, ఢిల్లీలో చర్చలు జరపడం ద్వారా సీసీఐ పునః ప్రారంభం కోసం ప్రయత్నాలు కొనసాగిస్తామని తెలిపారు. గతంలో పరిశ్రమల శాఖ మంత్రి కే.టి. రామారావు ఆధ్వ ర్యంలో సీసీఐ పునఃప్రారంభా నికి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజల పక్షాన నిలవాలని కోరారు.సీసీఐ పరిశ్రమ అమ్మకం, స్క్రాప్ టెండర్ల పేరుతో జరు గుతున్న కుట్రలను సీసీఐ సా ధన కమిటీతో కలిసి అడ్డు కుంటామని మాజీ మంత్రి జోగు రామన్న హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దర్శనాల మల్లేష్, సిసిఐ సాధన క మిటీ కన్వీనర్, విజ్జగిరిన రాయణ కో – కన్వీనర్, కొండ రమేష్, బొల్లు ఈశ్వర్, నంది రామయ్య, గోడం గణేష్, వెంకట నారాయణ, అరుణ్ కు మార్, మునిగెల నర్సింగ్, లంక రాఘవులు, లోకారి పోశెట్టి, బండి దత్తాత్రి, జగన్ సింగ్ భూ నిర్వాసితులు కస్తాల అరుణ్, కస్తాల ప్రేమల, ఉగ్గే విట్టల్, నాయకులు పట్టణ అధ్యక్షులు అజయ్, మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మెట్టు ప్రహ్లాద్, గంద్రత్ రమేష్,దాసరి రమేష్, వెనగంటి ప్రకాష్,కొండ గణేష్ దమ్మపాల్, అన్నల వసంత్, పండ్ల శ్రీను, బట్టు సతీష్, తదితరులు పాల్గొ న్నారు.

## నోట్ల కట్టలపైనే నరహరి నిద్ర

**హైదరాబాద్ :** తనిఖీలు చేపట్టారు. ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇళ్లు, ఆస్తులపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలు రావడంతో ఉదయం నుంచే నరహరి నివాసాలు, కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. హైదరాబాద్ పాతబస్తీలోని ఛత్రినాకలో ఉన్న నరహరి నివాసంతో పాటు ఆయన ఆఫీసు, బంధువుల ఇళ్లు, సన్నిహితుల ఇళ్లు సహా మొత్తం 11 ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో మెరుపు దాడులు చేశారు.ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇంట్లో భారీగా నగదు లభ్యమైంది. దాదాపు 1.10కోట్ల నగదును ఏసీబీ గుర్తించింది. పడక గదిలో బెడ్ కింద నగదు స్వాధీనం చేసుకున్నారు. నోట్ల కట్టలను బెడ్ గా చేసుకుని అధికారి నిద్రిస్తున్నాడని గుర్తించిన ఏసీబీ అధికారులు షాకవుతున్నారు. ఏసీబీ అధికారులు ఈ సోదాల్లో భాగంగా నరహరి ఇళ్లలో లభ్యమైన భారీ నగదు, బంగారు ఆభరణాలు, విలువైన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్స్, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలోని ఏసీబీ ప్రత్యేక బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. ప్రభుత్వ ఉన్నతాధికారి నివాసంలో ఒకేసారి ఇన్ని చోట్ల ఏసీబీ దాడులు జరగడం రెవెన్యూ, భూ సర్వే విభాగాల్లో కలకలం రేపుతోంది. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని, పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.తెలంగాణ రెవెన్యూ శాఖలో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ కే. వంశీ మోహన్ ఇళ్లపై ఏసీబీ అధికారులు భారీ దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో భాగంగా హైదరాబాద్ సహా 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. గతంలో శేరిలింగంపల్లి ఆర్డీవోగా పనిచేసిన సమయంలో వంశీ మోహన్ అధికార దుర్వినియోగానికి పాల్పడి వందల కోట్ల అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. పిగ్లీపురంలో 8 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి తన మామ పేరిట రిజిస్ట్రేషన్ చేయించడం, మ్యుటేషన్ల కోసం రియల్టర్ల నుండి తన బంధువుల పేర్లపై 10 ప్లాట్లను గిఫ్ట్ డీడ్ల రూపంలో ముడుపులుగా తీసుకోవడం వంటి కీలక అక్రమాలను అధికారులు గుర్తించి, ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

## వరంగల్ కు పవన్

**వరంగల్:** పవన్ కళ్యాణ్ తెలంగాణ గడ్డపై అడుగుపెట్టబోతున్నారు. ఈ పర్యటనకు ఒక ప్రత్యేకమైన, భావోద్వేగ కారణం ఉంది. బుధవారం రోజు వరంగల్ హనుమకొండలో మృత్యువుతో పోరాడుతున్న తన వీరాభిమాని నిరంజన్ చివరి కోరిక మేరకు పవన్ కళ్యాణ్ అతని ఇంటికి వెళ్లను పవన్ కల్యామ్‌ను ? చూడాలనే తన చివరి కోరిక మేరకు అతని ఇంటికి వెళ్లనున్నారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకోనున్నారు.హనుమకొండకు చెందిన నిరంజన్‌కు పదహారేళ్లు. చిన్నప్పుడు మామూలుగానే ఉండేవాడు. అయితే కానీ, 8 ఏళ్ల క్రితం అతడి జీవితం ఒక్కసారిగా మారిపోయింది. జన్యుపరమైన డీఎండీ వ్యాధి బారిన పడి పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. ఎదుగుదల పూర్తిగా లోపించింది. కాస్త గట్టిగా పట్టుకుంటే భరించలేని నొప్పి . ఇటీవల టీవీలో సీఎం రేవంత్ ఫుట్‌బాల్ మ్యాచ్ చూసిన నిరంజన్.. ఆయన్ను, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలవాలనుందని తెలిపాడు. నిరంజన్ కోరికను జనసేన నేతలు, పవన్ అభిమానులు ఆయనకు వివరించారు. ఈ విజ్ఞప్తిని మన్నించిన పవన్ కల్యాణ్ రేపు హనుమకొండ వచ్చి నిరంజన్‌ను పరామర్శించనున్నారు. జనసేనాని టూర్ నేపథ్యంలో ఆ పార్టీ నేతులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అటు పోలీస్ శాఖ కూడా అప్రమత్తమైంది. పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనుంది. గత కొన్ని రోజులుగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి, పవన్ కళ్యాణ్‌కు మధ్య తీవ్రమైన వాగ్వాదం నడుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా జనసేన నిర్వహించ తలపెట్టిన తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ కు పోలీసులు, హైకోర్టు అనుమతి నిరాకరించడం వివాదానికి కేంద్ర బిందువైంది. దీనిపై జూబ్లీహిల్స్ నివాసంలో ప్రెస్ మీట్ పెట్టిన పవన్.. తెలంగాణ ఎవరి సొంత జాగీరు కాదు.. నన్ను హైదరాబాద్ రాకుండా ఆపేదెవరు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత ఢిల్లీ వేదికగా జరిగిన పార్టీ సేన ప్రస్థానం' సమావేశంలోనూ.. తెలంగాణ అమరవీరులను గుర్తించడానికి ఈ పాలకులకు 12 ఏళ్లు సరిపోలేదా అంటూ కాంగ్రెస్ నాయకత్వంపై విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్ కేవలం అభిమాని నిరంజన్‌ను కలిసి వెళ్ళిపోయినా.. ప్రస్తుతమున్న పొలిటికల్ టెన్షన్స్ దృష్ట్యా దానికి రాజకీయ ప్రాధాన్యత లభించడం ఖాయం.

## అన్యాయంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలి

ఆపరేషన్ ఫెయిల్ చేసిన వై ద్యురాలిపై కేసు నమోదు చేయాలి

ఎస్పీకి దళిత సంఘాల విజ్ఞ ప్తి, ఫిర్యాదు



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 16, (ప్రజా జ్యోతి)** జిల్లా కేంద్రంలోని శ్రీ రామ నర్సింగ్ డాక్టర్ శ్యామల రాణి సత్యనారాయణ ఆపరేషన్ ఫెయిల్ చేసి వైద్యం వికటించి దళిత మాదిగ కులానికి చెం దిన వాణిశ్రీ అనే ఓగర్భిణీ స్త్రీచావు బతుకుల్లో నాగపూర్ లో ట్రీట్మెంట్ జరుగుతున్న సందర్భంగా ఆసుపత్రికి వైద్యుల సంఘ బృందం మాదిగ కుల సంఘా పెద్దలను పి లిచి వైద్య ఖర్చులకు 50% ఇస్తామని ఒప్పుకొని తిరిగి వారే బెదిరించి అక్రమంగా కేసులు పెట్టిన కేసులను ఎత్తివేసి ఆసుపత్రిలో జరిగిన సంఘటన పై విచారణ జరిపించి డాక్టర్ శ్యామల రాణిపై అట్రాసిట్ కేసు నమోదు చేసి ఆమె డాక్టర్ సర్టిఫికెట్ రద్దు చేయించాలని ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ను ,డిఎంహెచ్వో కూడా కలిసి నట్టుగా వివరించారు. చర్చల పేరుతో పిలిచి కులం పేరుతో దూషించి అక్రమంగా అన్యాయంగా వారే తిరిగి కేసులు పెట్టడం ఎంతవరకు సమంజ సమని, తాము ఎస్పీ, జిల్లా క లెక్టర్ ను కలుస్తామని చెబితే వద్దు కలువద్దు అని వారే బల వంతం చేసి ఉల్టా మాపై కేసు లు పెట్టడం దౌర్జన్యంతో కూడి న వేధింపు కాబట్టి దళితుల పై జరుగుతున్న దాడులను పరిగణలోకి తీసుకొని డాక్టర్ తో పాటు మిగతా డాక్టర్ లైనా శ్యామల సత్య నారాయ ణ కళ్లెం వెంకటరెడ్డి, కాలే సతీష్, శివ, సాయి కృష్ణ, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎస్పీ సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీని కలిసిన దళిత సంఘాల వారిలో చందల రాజన్న, అల్లూరి భూమన్న, అగ్గిమల్ల గణేష్, ఆరెల్లి మల్లేష్ అన్నేల లక్ష్మణ్, గాలిపెల్లి నాగన్న, నిమ్మల ప్రశాంత్ ఇజ్జ గిరి సంజయ్, ప్రభాకర్, దేవ దాస్, జితేందర్, అశోక్, విట్ట ల్, అశోక్ సతీష్, కోరేటి ప్ర భాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 21న నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి:

కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ :** కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టీఏ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించే నీట్ పరీక్షను భద్రత నడుమ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో విద్య, వైద్య, ఆర్టీసీ, పోలీస్, ఎన్పీడీసీఎల్ శాఖల అధికారులతో నీట్ పరీక్ష నిర్వహణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 3,001 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5:15 గంటల వరకు ఉంటుందని..ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో కంటే ఈసారి పరీక్షకు 15 నిమిషాలు ఎక్కువ సమయం ఉంటుందన్నారు. అభ్యర్థులు పాస్ ఫోటో, గుర్తింపు కార్డు, అడ్మిట్ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. ఆభరణాలు, షూలు ధరించి రావద్దని,నిబంధనలు విధిగా పాటించాలని అభ్యర్థులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిర్వహణ, అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను, పరీక్ష కేంద్రం వద్ద మందులతో శిబిరం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను